క్లుప్తంగా

ఉద్యాన పంటలపై అవగాహన


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

హత్నూర(సంగారెడ్డి): ఉద్యానవన పంటలపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఉద్యానవన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ అన్నారు. మంగళవారం సమీకృత ఉద్యానవన అభివృద్ధి మిషన్ పథకంలో భాగంగా ఉద్యాన పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. కూరగాయల, పండ్ల తోటలసాగు, చీడపీడల నివారణపై ఎప్పటికప్పుడు అధికారుల సలహాలు సూచనలు తీసుకోవాలని సూచించారు. అధిక దిగుబడుల కోసం పండ్ల తోటల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ, ఉద్యానశాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల వివరాలపై రైతులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ సరిత, అందోల్, జోగిపేట్ ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్, మండల ఉద్యాన అధికారి సమత, ఏఈఓ మహేందర్, ఏఈఓ రమేష్, రైతులు పాల్గొన్నారు.

'సైబర్ బెదిరింపులకు నో చెప్పండి'


అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: సైబర్ బెదిరింపులు, సైబర్ నేరాలపై సమాజానికి అవగాహన కల్పించడానికి ఒక సృజనాత్మక ప్రయత్నం, పటాన్‌చెరు మండలం రుద్రారం గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని అప్లైడ్ సైకాలజీ విభాగం చేసింది. 'సే నో టు సైబర్' పేరిట వీధి నాటకాన్ని జీ-బ్లాక్ ఎదుట ప్రదర్శించారు. ఆన్‌లైన్ భద్రత గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఉన్న పలువురు విద్యార్థులను ఆకర్షించింది. ఏదైనా సైబర్ బెదిరింపు సంఘటలు జరిగితే, వాటిని ప్రత్యేక హాట్‌లైన్ 1930 కు ఫిర్యాదు చేయడం, లేదా cyber crime. gov.inని సందర్శించడంతో ఉపశమనం పొందవచ్చని నాటకం ద్వారా పేర్కొన్నారు.

వివరాల నమోదు తప్పనిసరి


పాల్కంపల్లిలో ఫొటోలు తీస్తున్న అధికారులు

మునిపల్లి(అందోల్): సాగుకు యోగ్యత ఉన్న వ్యవసాయ భూముల్లో పంట ఉన్నా లేకున్నా ఒక్కో వ్యవసాయ విస్తరణ అధికారి 2 వేల ఎకరాల వరకు ఫొటోలు తీయాలని సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చాయి. మంగళవారం మండలంలోని మక్త క్యాసారం, పెద్దచల్మెడ, పాల్కంపల్లి, మేళసంగ్యం, హైద్లాపూర్ గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు రహిమాన్, నిఖిత, అంజన్న, స్నేహ, లావణ్యలు పర్యటించి వ్యవసాయ పంటలు లేని భూముల్లో ఫొటోలు తీశారు. జొన్న, శనగ తదితర పంటల వివరాలను నమోదు చేస్తున్నారు.

డ్రైనేజ్ సమస్యను పరిష్కరించండి


జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కార్పొరేటర్ పుష్ప మంగళవారం జలమండలి ఎండీ అశోక్ రెడ్డిను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అనేక కాలనీల్లో ప్రజలు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని అధికారులకు వివరించాననని అన్నారు. జలమండలి ఎండీ అశోక్ రెడ్డి కలసి డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం చీమల్‌పాడులో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి మంగళవారం తనిఖీ చేశారు. తల్లులు, పిల్లలకు పౌష్టికాహారం అందించడంపై టీచర్ సావిత్రితో మాట్లాడి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కంకర వేశారు.. తారు మరిచారు!

అధ్వానంగా రహదారి

- ప్రమాదాల బారిన ద్విచక్రవాహనదారులు
- అందోల్ నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి

గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం మెరుగుపరచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం తారు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారులు నాలుగు నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయడం లేదు.. కంకర పోసి వదిలేశారు.. దీంతో ప్రజలు రవాణాకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరగా రోడ్డుకు తారు వేయాలని ప్రజలు కోరుతున్నారు.


ముద్దాయిపేట వద్ద కంకర పరిచిన రోడ్డు

పుల్‌కల్(అందోల్): నియోజకవర్గంలోని గుంతల రోడ్ల మరమ్మతుల పనులు నత్తనడక సాగుతున్నాయి. పుల్‌కల్, చౌటకూర్, అందోల్, అల్లాదుర్గం, టేక్మాల్, మునిపల్లి, రాయికోడ్, మండలాల్లో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఆయా రోడ్లకు నిధులు సైతం మంజూరయ్యాయి. ఈ రోడ్లకు ప్యాచ్ వర్కులు చేయడానికి గుత్తేదారు పనులు ప్రారంభించారు. రోడ్లను చేస్తుంటే త్వరగా అందుబాటులో వస్తాయని ప్రజలు భావించారు. అయితే, గుత్తేదారు రోడ్లను తవ్వి కంకరతో చదును చేసి.. తారు వేయకుండా పనులను మధ్యలోనే ఆపేశారు.

వాహనదారుల ఇక్కట్లు

నియోజకవర్గంలో ఆయా గ్రామాల రోడ్ల మరమ్మతు పనులను గుత్తేదారులు అర్ధాంతరంగా ఆపేయడం.. కొన్ని రోడ్ల పనులు నత్తనడకన నడుస్తుండటంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కంకర పోసి వదిలి పెట్టిన గుత్తేదారులు తారు వేయడం మరిచిపోయారు. యాసంగి సీజన్‌లో కేజ్‌వీల్ ట్రాక్టర్లు తిరుగుతాయి.. నాట్లు వేసిన తర్వాత తారు రోడ్లు వేస్తామని గుత్తేదారుల అంటున్నారు. యాసంగి నాట్ల సీజన్ అయిపోయింది. ఇప్పటికైనా రోడ్ల మరమ్మతుల పనులు పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎఫ్‌డీఐ పెంపుపై నిరసన


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

జహీరాబాద్ టౌన్: బీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని పెంచడంపై ఎల్‌ఐసీ ఉద్యోగులు మంగళవారం పట్టణంలోని కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జహీరాబాద్ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎఫ్‌డీఐ పెంపు అవాంఛనీయమన్నారు. ఈ నిర్ణయం భారతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి అవసరమైన మూలధనం సమీకరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. విదేశీయ పెట్టుబడులను ఆపాలని, బీమా చట్ట సవరణ బిల్లును రద్దుచేయాలని, ఎల్‌ఐసీ ప్రియంపై విధిస్తున్న జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పాత పెన్షన్ విధానాన్ని అమల చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అశోక్, మాణయ్య, అశోక్, రాజేశ్వర్, రామకృష్ణ, మోహనకృష్ణ, విష్ణు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు తదితరులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకులు విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. జీవశాస్త్ర అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ సదయ కుమార్ మాట్లాడుతూ.. జీవకణాలు నియంత్రణ కోల్పోయి అవిచ్ఛిన్నంగా విభజన చెందడాన్ని క్యాన్సర్ అంటామన్నారు. ఒకే చోట నియంత్రణ లేకుండా కణుతులు ఏర్పడితే వాటిని శస్త్రచికిత్స ద్వారా తొలగించవచ్చన్నారు. డాక్టర్ సరోజినీ మాట్లాడుతూ.. క్యాన్సర్‌కు భయపడాల్సిన పనిలేదని, ప్రోస్టేట్, థైరాయిడ్, బ్రెస్ట్ క్యాన్సర్లు వచ్చినప్పుడు శాస్త్ర చికిత్స ద్వారా నయం చేయవచ్చని, క్యాన్సర్ ప్రారంభ దశలో ఉంటే రేడియేషన్ థెరపి, కీమో థెరపి, సర్జరీల ద్వారా నయం చేయవచ్చన్నారు. మన ఆహారపు అలవాట్లను మార్చుకొని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటే క్యాన్సర్ వ్యాధికి దూరంగా ఉండవచ్చని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కెఎస్ రత్నప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారులు జీవశాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

హత్నూర(సంగారెడ్డి): భక్తితోనే ముక్తి సులభమని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామీజీ అన్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్ భవాని స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామీజీ భక్తులను ఉద్దేశించి ప్రవచనాలు బోధించారు. దైవచింతనతో మనసు ప్రశాంతత లభిస్తుందన్నారు. ఉదయం భవాని స్ఫటిక లింగేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారిని హనుమాన్ మందిరం నుంచి శివాలయం వరకు ఎదురుకోలు నిర్వహించారు. గ్రామంలో రథోత్సవం, శివపార్వతుల పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రదీప్ శర్మ, మాణిక్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, బీజేపీ మెదక్ జిల్లా నూతన అధ్యక్షుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం.. సోమవారం నిర్వహించిన తనిఖీల్లో 12 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారిని మంగళవారం కోర్టులో హాజరుపరచగా ఆరుగురికి రూ.1500, మరో ఐదుగురికి రూ. 1000, మరో వ్యక్తికి రూ.2 వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



నారాయణఖేడ్: శాసనమండలి ఎన్నికలకు సంబంధించి నిజాంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాన్ని మంగళవారం ఎన్నికల నోడల్ అధికారి సోమేశ్వర్‌రావు, నిజాంపేట తహసీల్దార్ నాగజ్యోతి పరిశీలించారు. తరగతి గదులు, అందుబాటులో ఉన్న వసతులను చూశారు. వారివెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ జాన్సన్, రెవెన్యూ సిబ్బంది శ్రీకాంత్, పండరి ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ


రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని మల్గి పంచాయతీ కార్యదర్శి గోవర్ధన్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో జహీరాబాద్ డీఎల్‌పీఓ అమృత మంగళవారం విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యదర్శి విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని, వసూలు చేసిన పన్నులను దుర్వినియోగం చేస్తున్నాడని ఇటీవల గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. పైఅధికారుల ఆదేశాల మేరకు మంగళవారం గ్రామానికి చేరుకున్న డీఎల్‌పీఓ అమృత పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ప్రజలు చెల్లించిన పన్నుల వివరాలను పంచాయతీ కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. విచారణ జరిపి నివేదికలను జిల్లా అధికారులకు పంపిస్తానని డీఎల్‌పీఓ అమృత తెలిపారు.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు


వ్రతాలు చేస్తున్న దంపతులు

పుల్‌కల్(అందోల్): సింగూరు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు ఇవ్వాలి


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు: సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఎం పార్టీ సీనియర్ నాయకులు నర్సింహారెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అర్హులందరికీ డబుల్ బెడ్ రూంలు, ఇందిరమ్మ ఇల్లు, పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలోనే దరఖాస్తులు చేసిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు పెన్షన్ల కోసం వందలాదిమంది అర్హులైన పేదలు ఎదురు చూస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వం కంటే పెన్షన్లు పెంచి ఇస్తామన్న ప్రభుత్వం సర్వేల పేరుతో కాలయాపన చేస్తుందని విమర్శించారు. అమీన్‌పూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూంలను మున్సిపల్ పరిధిలోని అర్హులైన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు వీరస్వామి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కార్మికశాఖ ఆఫీస్ ఎదుట ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: కార్మికశాఖ సహాయ అధికారి, సిబ్బంది విధులకు చుట్టపుచూపుగా హాజరవుతూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ మంగళవారం కార్మికశాఖ సహాయ అధికారి కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు చిరంజీవి మాట్లాడుతూ.. వివిధ పథకాలకు కార్మిక కార్డు అవసరం కావడంతో లబ్ధిదారులు సకాలంలో కార్డులు అందక కార్యాలయం చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 400 కార్డులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సకాలంలో కార్డులు అందక నష్టపోతున్నారని వాపోయారు. నాయకులు అశోక్, విజయ్, పాపయ్య పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్‌లో డప్పుల ర్యాలీ


డప్పుల ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): 7న హైదరాబాద్‌లో జరగనున్న 'లక్ష డప్పులు వేల గొంతుల' మహాసభను విజయవంతం చేయాలని బీహెచ్‌ఈఎల్ మాదిగ ఉద్యోగుల ఆధ్వర్యంలో భెల్ టౌన్‌షిప్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహం నుంచి లింగంపల్లి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వరకు డప్పుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎంఈఎఫ్ అధ్యక్షుడు దేవేందర్, భెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న లక్ష డప్పులు వేల గొంతుల కార్యక్రమంలో పాల్గొనటానికి లక్ష లాది మంది మాదిగ సామాజిక వర్గం సిద్ధమైందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే వర్గీకరణపై స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో భెల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్య దర్శి నరేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు


శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జహీరాబాద్ టౌన్: రక్తహీనత ముక్త్‌భారత్‌లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వం పాఠశాల నం.1లో మంగళవారం విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు డాక్టర్ ఇమ్రాన్, డాక్టర్ హౌసప్ అమెదాలు పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ తక్కువగా ఉన్నవారికి ఐరన్ టాబ్లెట్‌లు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు రక్తహీనత తగ్గించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం.స్వామిదాస్, ఉపాధ్యాయులు హనుమంత్ పవార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ సింధు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): భారతినగర్ డివిజన్ మ్యాక్‌సొసైటీ కాలనీలోని పంచముఖీ ఆంజనేయస్వామి ఆలయ 10వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ వి.సింధూరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ఓటర్ జాబితాకు సహకరించండి



నారాయణఖేడ్: ఓటరు జాబితా నిర్వహణకు ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికలు-2025 నిర్వహణలో భాగంగా రెండవ విడత అదనపు ఓటర్ల జాబితా ప్రచురణకు సంబంధించి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులంతా ఓటర్లుగా నమోదయ్యేలా చూడాలని కోరారు. అనంతరం ప్రతి నిధుల సందేహాలను నివృత్తి చేశారు. మండల పంచాయతీ అధికారి నారాయణ, ఉపాధిహామీ ఏపీఓ మాణిక్ రావు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

◆ నూతన కమిషనర్‌కు సన్మానం

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జైత్రామ్ నాయక్‌ను మాజీ వార్డు సభ్యుడు వీరేశం గౌడ్, శివశంకర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించారు.

◆ ఉత్తమ ఫలితాలు సాధించాలి

మునిపల్లి(అందోల్): 'పది' విద్యార్థులు అధిక మార్కులు సాధించడానికి ప్రభుత్వం ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోందని కంకోల్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుకారాం పేర్కొన్నారు. మంగళవారం కంకోల్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించారు. ఉదయం 1 గంట, సాయంత్రం 1 గంట చొప్పున ఆయా సబ్జెక్టులను బోధిస్తున్నారు. ప్రత్యేక తరగతులకు వచ్చే విద్యార్థులకు అల్పాహారం అందజేస్తున్నారు. తరగతులకు రాని విద్యార్థులకు స్వయంగా ఫోన్ చేసి పిలుస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ ఘనంగా రథసప్తమి పూజలు



జోగిపేట(అందోల్): జోగిపేటలోని జోగినాథస్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆల య ప్రాంగణంలోని 55 అ డుగుల లోహ రథానికి జోగినాథ రథోత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు భద్రయ్యస్వామి అర్చకులు సిద్దేశ్వర్ స్వాములు పూజలు చేశారు.

◆ చల్లగిరి వేంకటేశ్వర వార్షికోత్సవం

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం కడ్పల్ శివారులో చల్లగిరి వేంకటేశ్వర ఆలయం వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు మంగళవారం నిర్వహించారు. అద్దంకి తిరుమల వెంకట కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఉత్సవారం ప్రారంభించారు. వెంకటేశ్వర సన్నిధిలో అభిషేకం, హారతి, తదితర కార్యక్రమాలు చేపట్టారు.

◆ సైబర్ నేరాలపై అప్రమత్తత

కల్హేర్(నారాయణఖేడ్): సైబర్ నేరస్తుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సిర్గాపూర్ ఎస్ఐ వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం సిర్గాపూర్ ఉన్నత పాఠశాలలో సైబర్‌నేరాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైబర్ మోసగాళ్ల, చట్టం గురించి తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

◆ క్రీడల్లో నైపుణ్యం సాధించాలి

నారాయణఖేడ్: యువతీ యువకులు క్రీడల్లో నైపుణ్యం సాధించాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ తెలిపారు. ఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న నైట్ సర్కిల్ క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. కొంతసేపు యువతతో క్రికెట్ ఆడి ప్రేక్షకులను ఉత్సాహ పరిచారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు స్నేహ భావంతో మెలగాలన్నారు. మొదటిరోజు లోకల్‌బాయ్స్, జగన్నాథ్‌పూర్ టీంలు తలపడగా జగన్నాథ్‌పూర్ టీం విజయం సాధించింది.

◆ మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని పలు గ్రామాల మాజీ సర్పంచులు మంగళవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తుండగా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం మాట తప్పిందని మండిపడ్డారు. అక్రమ అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరని పోలీస్‌స్టేషన్‌లో నిరసన తెలిపారు.

◆ యువతి అదృశ్యం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ యువతి అదృశ్యమైన సంఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొల్లూరు డబుల్ బెడ్‌రూం కేసీఆర్‌నగర్‌లో నివాసం ఉండే నవ్యశ్రీ ఇంటర్ పూర్తి చేసి ఇంట్లో ఉంటుంది. ఈ నెల 3న బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో బంధువులు, మిత్రుల వద్ద ఆరా తీసిన ఆచూకీ లభించలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ వైభవంగా శివపార్వతుల రథోత్సవం

సంగారెడ్డి: శివపార్వతుల రథోత్సవం శివస్వాముల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతిరెడ్డిపల్లి కేతకీ సంగమేశ్వర ఆలయం నుంచి సోమేశ్వర్ వాడ పార్వతీ పరమేశ్వర దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఊరేంగిపులో నృత్యాలు, కోలాటం అందరిని ఆకట్టుకున్నాయి.

◆ సరస్వతీ విగ్రహం ఏర్పాటు

హత్నూర (సంగారెడ్డి): నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సరస్వతీ దేవి విగ్రహాన్ని మంగళవారం ప్రతిష్ఠించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు సొంత డబ్బులతో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అలాగే, పాఠశాల లోపలికి వచ్చే స్వాగతం బోర్డు కూడా ఏర్పాటు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు.

◆ బకాయిలు చెల్లించాలని వినతి

నారాయణఖేడ్: పార్లమెంటు ఎన్నికల్లో వివిధ టీంల్లో పనిచేసిన తమకు బకాయిల రెమ్యునరేషన్ చెల్లించాలని కోరుతూ బాధితులు మంగళవారం ఆర్డీఓ అశోక చక్రవర్తికి వినతిపత్రం అందజేశారు. జహీరాబాద్ పరిధిలోని వివిధ అసెంబ్లీ సెగ్మెంట్లలో పనిచేసిన వారికి రెమ్యునరేషన్ చెల్లించగా ఖేడ్‌కు సంబంధించిన వారికి మాత్రమే చెల్లించలేదని తెలిపారు.

◆ కల్హేర్‌లో ఆరు ఎంపీటీసీలు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రమేష్‌బాబు మంగళవారం తెలిపారు. కల్హేర్, మార్డి, కృష్ణాపూర్, మాసాన్‌పల్లి, బీబీపేట్, రాపర్తి ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని తెలిపారు.

నిజాంపేట్‌లో 6 ఎంపీటీసీలు..

నిజాంపేట్ మండలంలో ఆరు ఎంపీటీసీ స్థానాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సంగ్రామ్ తెలిపారు. నిజాంపేట్-1, నిజాంపేట్-2, ర్యాలమడుగు, బాచేపల్లి,నాగధర్, రాంరెడ్డిపేట్ స్థానాలు ఉన్నాయి.